క్లుప్తంగా

కార్మికులకు అండగా ఐఎన్‌టీయూసీ పోరాటాలు



భెల్ అడ్మిన్ బిల్డింగ్ ఎదురుగా జెండాను ఆవిష్కరిస్తున్న ఇంటక్ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: ఇంటక్ 79వ ఆవిర్భావ దినోత్సవాన్ని భెల్ (హెచ్‌పీవీపీ) ఇంటక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంస్థ అడ్మిన్ బిల్డింగ్ ఎదురుగా శనివారం సీహెచ్.సీతన్ నాయుడు ఆధ్వర్యంలో సీనియర్ కార్యకర్త కె.వి.రమణ ఇంటక్ పతాకాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇంటక్ ప్రధానకార్యదర్శి ఉరుకూటి బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ కంపెనీల పరిరక్షణకు, ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఐకమత్యంతో పోరాటం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీటూ ప్రధానకార్యదర్శి జి.టి.పి.ప్రకాష్, సీనియర్ నాయకులు వారాడ ఆనందరావు, పి.ఆనంద్ కుమార్, సీహెచ్.మురళీశ్వరరావు, అల్లు అప్పారావు, డి.చిట్టిబాబు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అక్కిరెడ్డిపాలెం: డిగ్రీ చదివిన విద్యార్థులకు స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తున్నామని షీలానగర్‌లోని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు తెలిపారు. వైద్య ఆరోగ్య రంగంలో నైపుణ్యాలను అందించే ఈ సర్టిఫికెట్ కోర్సుకు డిగ్రీ పాసైన లేదా ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా అర్హులని పేర్కొన్నారు. 18 నుంచి 30 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏడాది వ్యవధి గల ఈ కోర్సులో ఆరు నెలల పాటు అభ్యర్థులకు స్టైఫండ్ అందిస్తామన్నారు. కోర్సు పూర్తి అనంతరం ఆయా రంగాల్లో ఉద్యోగ అవకాశాలు అందిస్తామన్నారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు డిప్లొమా, బీఎస్సీ, పారామెడికల్, నర్సింగ్, ఎంఎల్టీ, బీపీటీ, కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఈ కోర్సుల్లో చేరాలకునే విద్యార్థులు 7995013421, 7995013422 నంబర్లలలో సంప్రదించాలని, మరిన్ని వివరాలకు షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వెనుక నున్న బొల్లినేని మెడ్‌స్కిల్స్‌లో సంప్రదించాలని కోరారు.

మురుగు పోయే మార్గం ఏర్పాటు చేయాలని వినతి



కార్పొరేటర్‌కు వినతిపత్రం అందిస్తున్న పండా వీధి మహిళలు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి జగన్నాథస్వామి ఆలయం వెనుక భాగం, పరిసర ప్రాంతాల్లో వాడుక నీరు పోయే మార్గం లేకపోవడంతో సతమతమవుతున్నామని, డ్రైనేజీలు నిర్మించాలని పండావీధి కుటుంబాల మహిళలు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. అగనంపూడి కూడలిలోని బస్టాప్ వెనుక వైపు వీధులు లోతట్టు ప్రాంతంలో ఉండడంతో దోమలు, పందులకు ఈ ప్రాంతం ఆవాసంగా మారిందని వివరించారు. డ్రైనేజీలు నిర్మించేలా చొరవ తీసుకోవాలని నాయకులు గళ్ల రాజు, మహిళలు విజ్ఞప్తి చేశారు.

పేదలకు చీరల పంపిణీ



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న నాయకులు

గాజువాక: ప్రతి ఒక్కరూ ఉన్నంతలో సేవా కార్యక్రమాలు చేయాలని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. తన జన్మదినం సందర్భంగా శనివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. పాతగాజువాక జంక్షన్‌లో చలివేంద్రం ఏర్పాటు చేశారు.దీన్ని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం పేదలకు గొడుగులు, చీరలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, కూటమి నాయకులు బాటా శ్రీనివాస్, కరణం కనకారావు, ప్రసాదుల శ్రీనివాస్, గూటూరు శంకరరావు పాల్గొన్నారు.



11 నెలలు అయినా..

సర్వేశా.. ఏడీ పింఛైన్..!

ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు పూర్తయినా నూతన పింఛన్లకు దరఖాస్తు చేసుకోవడానికి కూడా అవకాశం లేకపోయింది. దీంతో అర్హత ఉన్న వారికి ఎదురు చూపులు తప్పడం లేదు. గతేడాది అక్టోబర్ 1 నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఆ దిశగా చర్యలు మాత్రం చేపట్టలేదు. ఇంత వరకూ ఒక్కరికీ కూడా కొత్తగా పింఛన్ మంజూరు చేయలేదు. దరఖాస్తు చేసుకోవడానికి వెబ్‌సైట్‌ను కూడా అందుబాటులోకి తీసుకురాలేదు. ఎటువంటి ఆసరా లేని వారిని కూటమి ప్రభుత్వం ఆదుకోకుండా వంచనకు గురి చేస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



పండుటాకుల ఎదురుచూపులు

దరఖాస్తులకు మోక్షం లేక నిరాశ



ఖాళీగా సచివాలయం

పెదగంట్యాడ: ప్రతి నెలా ఒకటో తేదీ కోసం వృద్ధులు.. వితంతువులు, దివ్యాంగులు ఎదురు చూస్తుంటారు.. ప్రభుత్వం అందజేసే సామాజిక పింఛన్ల కోసం గంపెడాశ పెట్టుకున్న వారికి ఇప్పుడు నిరాశే ఎదురవుతోంది.. కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.. గత ప్రభుత్వ హయాంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రతి నెలా ఒకటో తేదీన ఠంచన్‌గా పింఛన్ అందేది. తెల్లవారక ముందే తలుపుతట్టి మరీ సొమ్ము అందజేసేవారు. కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్ల ఊసెత్తడం లేదు. దీంతో వృద్ధులు, వితంతువులు.. దివ్యాంగులు ఆందోళన చెందుతున్నారు.

ఆ హామీ అంతేనా!

గత ఎన్నికల ముందు బీసీలకు యాభై ఏళ్లకే పింఛన్లు ఇస్తామని కూటమి నాయకులు ప్రకటించారు. ఆ హామీని ఇప్పుడు గాలికి వదిలేశారని పలువురు ఆరోపిస్తున్నారు. బీసీలకు సమన్యాయం ఎక్కడని ప్రశ్నిస్తున్నారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని అంటున్నారు.



వెలవెలబోతున్న సచివాలయం

నా భర్త పింఛన్ నాకు రాలేదు



నాకు ఇప్పుడు 63 ఏళ్లు.. నా భర్తకు గత ప్రభుత్వ హయాంలో ఫించన్ వచ్చేది. నా భర్త రెండేళ్ల కిందట చనిపోయారు.. తర్వాత ఆ ఫించన్ నాకు బదలాయించలేదు.. నాకు ఎటువంటి ఆసరా లేదు. వృద్ధాప్యం కావడంతో నేను ఏ పనికీ వెళ్లలేని పరిస్థితి. మాలాంటి వారి గురించి ప్రభుత్వం ఆలోచించి వెంటనే పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి.

– ఎం.లక్ష్మి, పెదగంట్యాడ

నా భర్త చనిపోయి ఏడాదైనా..

నాకు ఇప్పుడు 35ఏళ్లు.. నా భర్త అనారోగ్యంతో చనిపోయి ఏడాదవుతోంది.. ఇప్పటి వరకూ నాకు వితంతు పెన్షన్ మంజూరు చేయలేదు.. దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయానికి వెళ్తే వెబ్‌సైట్ పని చేయడం లేదని చెబుతున్నారు. నాకు ఎటువంటి ఆసరా లేదు.. ఇద్దరు పిల్లలతో ఇల్లు గడవడం కూడా కష్టం ఉంది.. పింఛన్ మంజూరు చేసి ప్రభుత్వమే ఆదుకోవాలి. –పి రత్నం, పెదగంట్యాడ

వితంతు పెన్షన్‌లో మెలిక..

వృద్ధాప్య పింఛన్ అందుకుంటున్న వ్యక్తి మృత్యువాత పడితే అతని భార్యకు మాత్రమే ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే దీని ప్రకారం అది కొత్తగా మంజూరు చేసినట్టు కాదన్నది స్పష్టం. అలాగే కుటుంబంలో పింఛన్‌దారుడు మరణిస్తే అతని భార్యకు బదలాయిస్తున్నారు తప్ప పింఛన్ లేని వ్యక్తి చనిపోతే మాత్రం అతని భార్యకు కొత్తగా పింఛన్ మంజూరు చేయడం లేదు. పెదగంట్యాడ మండల పరిధిలోని నెల్లిముక్కు, సీతానగరం, నడుపూరు, ఇస్లాంపేట, నమ్మిదొడ్డి తదితర ప్రాంతాల్లో సుమారు వెయ్యికి మందికి పైగా 60 ఏళ్లు నిండిన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఎదురు చూపులు చూస్తున్నారు. అలాగే మండలంలో మరో మూడు నాలుగు వేల మంది వరకూ యాభై ఏళ్లు దాటిన బీసీలు కొత్త పింఛన్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

పింఛన్ల ఏరివేత

కొత్త పింఛన్ల మాట దేవుడెరుగు ప్రస్తుతం వస్తున్న పింఛన్లలో కొన్నింటిని ఎలాగైనా తొలగించుందుకు శ్రీకారం చుట్టారు.. పింఛను లబ్ధిదారుల్లో అనర్హులు ఉన్నారంటూ కొద్ది రోజులుగా సర్వేలు నిర్వహించి కొంతమందికి పింఛన్లు రాకుండా నిలిపివేశారు.

సమ్మె నోటీసు అందజేత



స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎంకు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యానికి శనివారం అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు సమ్మె నోటీసు అందజేశారు. కార్మిక సమస్యలు, కార్మిక చట్టాలు మార్పు, సుప్రీంకోర్టు తీర్పు మేరకు హయ్యర్ పెన్షన్ అమలు తదితర డిమాండ్లపై జాతీయ కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా ఈనెల 20న సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో జాతీయ డిమాండ్లతో పాటు కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలన్న డిమాండ్‌పై సమ్మెలో పాల్గొంటామని ఉక్కుహెచ్‌ఆర్ జీఎం ఎం. మధుసూదనరావుకు అందజేసిన నోటీసులో పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు నమ్మి రమ, కె. వంశీ, ఆనంద్, నాగరాజు, పి. గుర్నాథ్, నమ్మి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మెడిటేషన్‌పై అవగాహన



మెడిటేషన్ చేయిస్తున్న గ్రంథాలయాధికారి చంద్రకళ

గాజువాక: గాజువాక శాఖా గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా చిన్నారులకు మెడిటేషన్‌పై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మెడిటేషన్ వల్ల ఉపయోగాలను గ్రంథాలయాధికారి బి.చంద్రకళ విద్యార్థులకు వివరించారు. రోజూ ధ్యానం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండటంతో పాటు మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వారితో మెడిటేషన్ చేయించారు. అనంతరం చిన్నారులకు పాటలపోటీలు నిర్వహించారు.

కొనసాగుతున్న వాటర్ బాటిళ్ల పంపిణీ

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో జనరల్ బోగీలు, దివ్యాంగులు, మహిళా బోగీల ప్రయాణికులకు స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు మినరల్ వాటర్ పంపిణీ చేయడాన్ని వాల్తేరు డీఆర్ఎం అభినందించారు. జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్‌కు ఈమేరకు వాట్సాప్ ద్వారా అభినందనలు తెలిపారు. శనివారం బెంగుళూరు భువనేశ్వర్‌ల మధ్య నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లోని ఆరు బోగీల ప్రయాణికులకు వాటర్ బాటిళ్లు అందించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాల నేతలు కంచుమూర్తి ఈశ్వర్, ఎంఎస్ఎన్‌మూర్తి, జాషువా, భాస్కరరాజు, ఆదిల్ రెహమాన్, శ్రీనివాస్, ఏసురత్నం, సత్యనారాయణ, సుందర మూర్తి, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.



ప్రయాణికులకు పంపిణీ చేయడానికి మినరల్ వాటర్ బాటిళ్లతో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

కార్మికుల చేతుల్లోనే పారిశ్రామిక భద్రత

ఉక్కునగరం: పారిశ్రామిక భద్రత పరిశ్రమ యాజమాన్యంతో పాటు కార్మికులందరిపై ఆధారపడి ఉంటుందని కేంద్ర ఈఎస్ఐ విశ్రాంత కమిషనర్ బి.కె. సాహు అన్నారు. స్టీల్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో 'సంక్షోభాల సమయంలో ప్రమాదకర పరిశ్రమల్లో భద్రత ప్రాముఖ్యత' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన ప్రసంగించారు. ఏడు బంగారు భద్రతా సూత్రాల ఆధారంగా ప్రమాదాలు నివారించవచ్చన్నారు. కార్మికులు నాయకత్వం వహించడం, ప్రమాదాలను గుర్తించడం, లక్ష్యాలు నిర్దేశించడం, సురక్షమైన ఆరోగ్యకరమైన వ్యవస్థను తయారు చేయడం, యంత్రాలు, పరికరాలు, కర్మాగార, కార్యాలయాల్లో భద్రత, ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చునన్నారు. ఉక్కు భద్రతా విభాగం సీజీఎం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్లాంట్‌లో ఇటీవల జరుగుతున్న ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులంతా భద్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు డి. ఆదినారాయణ, కె.ఎస్.ఎన్. రావు, జె. అయోధ్యరామ్, పి.వి. రమణమూర్తి, సెంట్రల్ సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సెమినార్ ప్రారంభిస్తున్న కేంద్ర ఈఎస్ఐ విశ్రాంత కమిషనర్ సాహు

ఘనంగా ఐఎన్‌టీయూసీ వ్యవస్థాపక దినోత్సవం

ఉక్కునగరం: ఐఎన్‌టీయూసీ 79వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం స్టీల్‌ప్లాంట్‌లో ఘనంగా నిర్వహించారు. ఉక్కు స్మృత్యంజలి పార్కు కూడలి వద్ద యూనియన్ సెక్రటరీ జనరల్ మంత్రి రాజశేఖర్ యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగా యూనియన్ ఆవిర్భవించి, సర్దార్ వల్లభాయ్ పటేల్, నేతాజీ వంటి పెద్దల చేతుల మీదుగా ఎదిగి నేడు 3.48 కోట్ల సభ్యులను కలిగి ఉందన్నారు. కార్మిక వర్గ ప్రయోజనాల సాధనలో యూనియన్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. అనేక వేతన సవరణలు చేసి దేశంలోని కార్మిక వర్గాన్ని ఆర్థిక ప్రయోజనాలు కల్పించిన ఘనత ఐఎన్‌టీయూసీది అని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పి.వి. రమణమూర్తి, ప్రధాన కార్యదర్శి బి.ఎస్. రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్ము ప్రసాద్, మద్ది అప్పలరాజు రెడ్డి, మింది దేముడు, ఎస్.ఎ. నాయుడు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్‌లో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకుడు మంత్రి రాజశేఖర్

స్టీల్‌ప్లాంట్ ఓబీసీ అసోసియేషన్ సేవలు అభినందనీయం



వెబ్‌సైట్, యాప్ ఆవిష్కరణలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్, హెచ్‌ఆర్ జీఎం, నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల అసోసియేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) జి.వి.ఎన్. ప్రసాద్ అన్నారు. ఉక్కు హెచ్‌ఆర్‌డీ విభాగంలో శనివారం ఆయన అసోసియేషన్ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో అసోసియేషన్ పెద్ద సంఘంగా ఉండడం వల్ల కార్మికులతో పాటు అధికారులకు ఉపయోగకరమన్నారు. సభ్యుల సంక్షేమం, అభ్యున్నతికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలన్నారు. హెచ్‌ఆర్ జీఎంలు ఎం. మధుసూదనరావు, ఎన్. భాను మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెబ్‌సైట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గతేడాది డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు సిల్వర్ కాయిన్లు అందజేశారు. విశ్రాంత జీఎం కె. సంజీవరావు, లైజన్ ఆఫీసర్ ఉమామహేశ్వరరావు, అసోసియేషన్ అధ్యక్షుడు బి. అప్పారావు, ప్రధానకార్యదర్శి శ్రీనివాసరావు, ఉప ప్రధానకార్యదర్శి కొయిలాడ శ్రీనివాస్, వై.ఎల్. నాయుడు, వి. సింహాచలం పాల్గొన్నారు.

త్వరలో మరిన్ని కొత్త బస్సులు



ఆర్టీసీ డిపోలో కంప్యూటర్లను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న నాయకులు

ఉక్కునగరం: ఏపీఎస్ఆర్టీసీకి త్వరలో మరిన్ని కొత్త బస్సులు రానున్నాయని ఆర్టీసీ జోనల్ చైర్మన్ ఎస్. దొన్ను దొర తెలిపారు. కూర్మన్నపాలెంలోని స్టీల్ సిటీ డిపోలో శనివారం జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సమక్షంలో ఆయన జోన్–1లోని అన్ని యూనిట్లు, డిపోల్లో సుమారు రూ. 30 లక్షల విలువైన 63 కొత్త కంప్యూటర్లను వర్చువల్‌గా ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా కొత్తగా వచ్చిన సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో జోన్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఎస్. బ్రహ్మానందరెడ్డి, విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి బి. అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి. సత్యనారాయణ, స్టీల్ సిటీ డిపో మేనేజర్ గౌతమ్ చటర్జీ, గాజువాక డిపో మేనేజర్ వి. ప్రవీణ, పర్సనల్ అధికారి తిరుపతి, ఈఈ పి.వి. నరసింహరావు, డిపో అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ యాప్‌ల అనర్థాలపై అవగాహన

గాజువాక: బెట్టింగ్ యాప్‌ల వల్ల అనర్థాలపై యువత, ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్టు పల్లా కార్తీక్ ట్రస్టు వ్యవస్థాపకుడు పల్లా కార్తీక్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు ప్రచారం నిర్వహించేందుకు అనుమతి కోరుతూ సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, గాజువాక సీఐ పార్థసారథిలకు వినతి పత్రాలు అందజేశారు. బెట్టింగ్ యాప్‌ల వల్ల యువత తీవ్రంగా నష్టపోయి ఆత్మహత్యకు పాల్పడుతున్నారని, ఇలాంటి అనర్థాలపై యువత, ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమం చేపట్టనున్నట్టు పేర్కొన్నారు.

సిరులతల్లికి తులసిపూజ

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు.

కిశోరి వికాసం.. బాలికల భవితకు పునాది



దిబ్బపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

పెదగంట్యాడ: కిశోరి వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్‌కు పునాది వేస్తుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. జీవీఎంసీ 65వ వార్డు పరిధి దిబ్బపాలెంలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోరి బాలికల సామాజిక అంశాలతో పాటు విద్య, వైద్యం, నైపుణ్యం, క్రీడలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం సచివాలయ మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహిచారు.

అరకొర వేతనాలతో అవస్థలు

కూర్మన్నపాలెం: ఉక్కు కర్మాగారంలో అరకొర వేతనాలు చెల్లిస్తున్నారని స్టీల్ సీఐటీయూ నాయకులు ఆరోపించారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న దీక్షాశిబిరాన్ని శనివారం సీఐటీయూ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా జె. సింహాచలం మాట్లాడుతూ కర్మాగారంలో లేబర్ కోడ్స్ అమలు చేయడానికి యాజమాన్య ప్రయత్న చేస్తుందని ఆరోపించారు. దీనిలో భాగంగానే ఉన్న వేతనాలు చెల్లించకుండా కార్మికులను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నారని విమర్శించారు. ఇటువంటి వాటిపై యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే క్రమశిక్షణ పేరుతో వేధింపులకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రామారావు,వెంకటేశ్వరరావు,అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



దీక్షశిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

చలివేంద్రాల ఏర్పాటు



ఆటోన గర్ డి - బ్లాక్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐలా మాజీ చైర్మన్ శేషగిరిరావు

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్ డి - బ్లాక్‌లో ఉచిత మజ్జిగ, మంచినీటి పంపిణీ చలివేంద్రాన్ని శనివారం ఆటోనగర్ ఐలా మాజీ చైర్మన్ శేషగిరిరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి (రఘు), వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, ప్రధానకార్యదర్శి చీకటి సత్యనారాయణ, వాసవీ అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, మాజీ అధ్యక్షుడు ఎ.కె.బాలాజీ, మాజీ ఉపాధ్యక్షుడు కృష్ణ ప్రసాద్, ఐలా మాజీ చైర్మన్ వై.సాంబశివరావు, పైవా అధ్యక్షుడు డి.సత్యనారాయణ, ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్స్ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



షీలానగర్ స్వామి అయ్యప్ప దేవాలయం వద్ద ..

అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో...

షీలానగర్‌లోని శ్రీ స్వామి అయ్యప్ప దేవాలయంలో అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సేవా సంఘం అధ్యక్షుడు గురుస్వామి అదపాక వెంకటరమణ మాట్లాడుతూ సేవా సంఘం ప్రతినిధి పాలమరశెట్టి బూలిరాజు కుమారుడు స్వర్గీయ బాలకృష్ణ జ్ఞాపకార్థం తొలిరోజు మజ్జిగ అందించినట్టు తెలిపారు. సేవా సంఘం ఆధ్వర్యంలో 24 ఏళ్లుగా చలివేంద్రం కొనసాగిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కోరాడ అప్పలనాయుడు, పలమరశెట్టి బూలిరాజు, ఎస్.ఎ.నాయుడు, మీసాల అప్పలనాయుడు, నాగూల రవికుమార్, సత్యనారాయణ, సీహెచ్. మురళీశ్వరరావు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళల రాణింపు

అగనంపూడి: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తుండడం ప్రగతికి చిహ్నమని అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె.భారతి అన్నారు. బొబ్రమాంబ పారాయణ సేవా సమితి సభ్యుల సేవలను ఆమె అభినందించారు. పారాయణ సేవా సమితి ప్రతినిధులు కోలాటం, పారాయణ పఠనంలో జిల్లా స్థాయిలో మంచి పేరు ప్రఖ్యాతలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ ఉషా, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, పరిపాలనాధికారి రవిరాజు, పారాయణ సేవా సమితి ప్రతినిధులు చిత్తా జానకి, శోభారాణి, పద్మ, లలితకుమారి, పుష్ప, కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి